

# అనగనగా ఓ మంచి కథ

## ఒయాసిస్సు

యం. ఉమామహేశ్వరరావు

(ఆంధ్రప్రభ వారపత్రిక జనవరి 5, 98)




**మొట్టమొదటిసారిగా** ఆమెను అమృతా నర్సింగ్ హోంలో చూసాను. మనిషి సన్నగా, రివ్వలా ఉంది. కళ్ళు మూసుకుని పడుకున్న జీవచ్ఛవంలా కనిపించింది.

ఆమె నా స్నేహితుడు విశ్వం భార్య.

తొమ్మిదో నెంబరు రూములో బెడ్‌మీద నిస్త్రాణగా పడి ఉందామె. పక్కనే బాటిల్‌లోనుంచి చుక్కలు చుక్కలుగా సెలైన్ ఆమె శరీరంలోకి ఎక్కుతోంది. కళ్ళు మూసుకుని ఉందామె.

నేనూ విశ్వం ఇద్దరం ఆ గదిలోకి అడుగులు వేసాం. బెంచీమీద కూర్చున్నాను నేను. విశ్వం ఆమె దగ్గరగా చేరాడు. అతని ముఖంలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. ఈలోగా తలుపులు తీసుకుని నర్సు లోపలకు వచ్చింది. విశ్వాన్ని చూసి పలకరింపుగా నవ్వింది.

"మీ మిసెస్‌కు మరింకేం ప్రాబ్లం లేదు. షి ఈజ్ ఆల్‌రైట్ సార్. రేపుదయాన్నే డిస్చార్జి చేస్తారు" అంది నర్సు.

విశ్వం ఏమీ మాట్లాడలేదు భార్యనోసారి ప్రేమగా చూసి గాఢంగా నిట్టూర్చాడు.

"విశ్వం ఏం ప్రాబ్లం లేదని నర్సు చెప్పింది కదా. మరేం దిగులుపడకు, పద. అలా బయటకు వెళ్ళి, కాఫీ తాగి వద్దాం" అంటూ విశ్వాన్ని తీసుకుని నర్సింగ్ హోమ్ నుంచి బయటికొచ్చాను. ఎదురుగా 'వెల్‌కమ్' హోటల్. ఖాళీ టేబులు చూసి కూర్చున్నాం. కాఫీ ఆర్డరు చేసాను.

నిశ్శబ్ధంగా చూస్తున్నాడు విశ్వం. అతనిలో అగ్నిపర్వతాలేవో బద్దలవుతున్నాయి.

"విశ్వం"

ఉలిక్కిపడి నావంక చూసాడు.

"జరిగిందేదో  జరిగిపోయింది. అదంతా మరిచిపోవాలి నువ్వు ఆమె పరిస్థితికి నువ్వు కారణం కాదని నాకు తెలుసు. అటువంటి భార్యతో వేగడం ఎవరికైనా కష్టమే. అయినా జాగ్రత్తగా ఆమెను నువ్వు డీల్ చేయగలిగితే నీ దారిలోకి తెచ్చుకోగలవు" అంటూ విశ్వం వంక చూసాను.

వాడిలో స్పందన రాలేదు. సర్వర్ కాఫీలు తెచ్చి టేబుల్‌పైన ఉంచి వెళ్ళాడు. చెరో కప్పు అందుకున్నాం.

అమృతా నర్సింగ్ హోం బిల్లులన్నీ చెల్లించేసి, ఆనక భార్యతోపాటుగా బయటకు వచ్చాడు విశ్వం. బయట ఆటో రిక్షా రెడీగా ఉంది. అందులోకి ఎక్కబోతూ అకస్మాత్‌గా ఆగిపోయిందామె.

"ఈయనెవరు?" నా వంక అనుమానంగా చూస్తూ అంది.

"నా ఫ్రెండ్. పేరు శ్రీరామ్. ఇక్కడే గాజువాకలో ఉంటున్నాడులే. నీకు ఒంట్లో బాగోలేదని, నర్సింగ్‌హోంలో జాయిన్ చేసానని తెలిసి, నన్ను చూడాలని వచ్చాడు."

నన్ను పరిచయం చేసాడు.

ఆమెలో ఏ మార్పూ కనిపించలేదు.

“డాక్టర్లకీ, మందులకీ డబ్బు ఎవరిచ్చారు? ఈయనేనా? ఆటో ఛార్జీలు ఎవరిస్తున్నారు? ఈయనేనా?”

ప్రశ్నమీద ప్రశ్న ఆమె నుంచి, నివ్వెరపోయాను నేను. విశ్వం నిస్సహాయంగా నా వంక చూసాడు. 'అదిరా ఆమె ప్రాబ్లం 'అన్నట్లుగా ఉందా చూపు.

ఆటో కదిలింది విశ్వం ఇంటివేపుగా. ఆటో కనుమరుగు అయ్యేంతవరకూ అలాగే చూస్తున్న నాకు ఆటోలోంచి విశ్వం చేయి ఊపడం కనిపిస్తూనే ఉంది. 'పూర్ ఫెలో' నిట్టూర్చాను.

'సాయంత్రం ఆరుగంటలు దాటింది. బాగా చీకట్లు కమ్మాయి. వీధిగేటు దగ్గర పొడవుగా, బాగా లావుగా ఉన్న ఆ శాల్తీని చూసి బయటకు వచ్చాను. నన్ను చూసి ఆ శాల్తీ పెదాలు పూర్తిగా విప్పి,

“శ్రీ రామ్ అంటే మీరేనా?" అని అడిగాడు.

"అవును నేనే. ఇంతకూ మీరు..?" నా ప్రశ్న పూర్తవ్వనేలేదు.

"నా పేరు వెంకట్రామయ్య. నేను విశ్వానికి మేనమామమని. ఇంతకీ నేను వచ్చింది" అని ఆగాడాయన. అంతవరకూ అతన్ని అలా బయటే నించోపెట్టి మాట్లాడుతున్నానని గుర్తొచ్చి "లోపలకు రండి. కూర్చుని మాట్లాడుకుందాం" అని లోపలకు ఆహ్వానించాను.

అడ్డంగా తలాడించాడాయన. “లేదు, బాబూ! ఏమీ అనుకోకపోతే నువ్వు నాతో ఇప్పుడు బయలుదేరి రాగలవా? కారణాలు అన్నీ తోవలో చెబుతాను.”

అతని కళ్ళల్లో అభ్యర్ధన తొంగి చూస్తోంది.

"సరే, పదండి వస్తున్నాను" అంటూ అతనితోపాటు బయలుదేరాను.

“దుర్గకు మొదట్నించీ, అంటే చిన్నప్పటినుంచీ అహంకారం హెచ్చు. తనీడు పిల్లదగ్గర తన అహంభావాన్ని తరచూ ప్రదర్శిస్తూండేది. ఆ రకమైన గుణం ఆ పిల్లలో చోటు చేసుకోడానికి కారణం మా అన్నయ్య మార్కండేయుడే. ఎంతో గారాబంగా పెంచాడు. అడిగినవన్నీ కొనిచ్చేవాడు. అదంతా మా వదినకు ఇష్టం ఉండేది కాదు. ఆడపిల్లను చిన్నప్పటినుంచి అలా గారాబం చేస్తే, ముందు ముందు అనేక సమస్యలు వస్తాయని పోరేది. కానీ ఆమె గోల గాల్లో కలిసిపోయేది. తండ్రీ కూతుళ్ళు ఏకమై ఆమెను ఎగతాళి పట్టించేవారు. దుర్గ ఆడింది ఆట, పాడింది పాటగా సాగింది.

కాలం మనిషి జీవితాన్ని ఒక్కోసారి ఎంత ఘోరంగా దెబ్బతీస్తుందో ముందుగా ఎవ్వరూ ఊహించలేదు. ఓ బస్సు ప్రమాదంలో మా అన్నయ్య మరణించాడు. నిజానికి ఆ ప్రమాదంలో మరణించింది మా అన్నయ్యే అయినా, ఆ కుటుంబం సర్వశక్తులూ మరణించాయనే చెప్పాలి. విధి వైపరీత్యం. ఎంతో గారాబంగా, అల్లారుముద్దుగా, డబ్బుకు ఏ ఇబ్బందీ లేకుండా పెరిగిన దుర్గకు అది పెద్ద షాక్. ఆ షాక్ నుంచి ఆమె చాలాకాలం తేరుకోలేదు.

ఓ మంచిరోజు చూసి మా మేనల్లుడు విశ్వాన్ని ఒప్పించి మేమే పెళ్ళి చేసాం దుర్గతో, చాలీచాలని జీతంతో ఎంతో గుంభనంగా గడుపుకోవాల్సిన గుమాస్తా జీవితం విశ్వానిది. ఇప్పుడు ఇలా.. కారణాలు ఏమయితేనేం విశ్వానికీ, దుర్గకీ ఖర్చుల విషయంలో క్షణం పడలేదు. దాని పర్యవసానమే ఇవన్నీ" చెప్పడం ఆపి కన్నీళ్ళు తుడుచుకున్నాడు వెంకట్రామయ్య.

మరో అయిదు నిమిషాల నడకతో శ్రామిక నగర్‌లోని విశ్వం ఇంటికి చేరాను వెంకట్రామయ్యతో సహా.

దుర్గ గురించి, విశ్వం గురించి మాత్రమే జరిగిన సంగతులన్నీ చెప్పాడుగానీ, అసలీ సమయంలో నన్నెందుకు పిలుచుకు వచ్చాడో చెప్పనేలేదు వెంకట్రామయ్య.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఏదో జరిగింది ఇక్కడ. ఏం జరిగింది? ఇంట్లో ఎవరో పెద్ద వయసామె కూర్చుని ఉంది. అంతవరకూ ఏడ్చి, ఏడ్చి అలసిపోయినట్లుగా ఉందామె ముఖం. వెంకట్రామయ్య వంక చూసాను. ఆయన కళ్ళు అందించిన సమాచారం గ్రహించాను. ఆమె వెంకట్రామయ్య భార్య. విశ్వం మేనత్త.

విశ్వం భార్య దుర్గ జాడలేదు. విశ్వం కూడా ఎక్కడా కనిపించలేదు. నా చూపుల్ని గ్రహించిందామె.

"దుర్గ లోపల గదిలో ఉంది" అంది.

అటు నడిచాడు వెంకట్రామయ్య నన్నూ రమ్మని సైగ చేస్తూ "భగవంతుడా విశ్వం ఇంట్లో లేని సమయంలో ఈవిడేదైనా అఘాయిత్యం తలపెట్టలేదు కదా! వాడసలే తట్టులోకేడు" ఆలోచిస్తూనే ఆ గదిలోకి ప్రవేశించాం. అంతే.

ఒక్కసారిగా ఏదో సుడిగాలి. యేదో ఝుంఝూమారుతంలాగే, నా దగ్గరకు వచ్చి,నా కాళ్ళను చుట్టేసినట్లుగా ఫీలయ్యాను. తమాయించుకుని చూసేసరికి నా కాళ్ళమీద దుర్గ.

"అన్నయ్యగారూ! అన్నయ్యగారూ నన్ను చంపెయ్యండి. నన్ను ముక్కలు ముక్కలుగా నరికెయ్యండి. నేను భరించలేను. ఆయన లేని జీవితం నేను భరించలేను. మూర్ఖురాల్ని ఆయన మనస్సు ముక్కలు ముక్కలు చేసాను. నన్ను చంపెయ్యండి. నా పీడ ఆయనకు లేకుండా చెయ్యండి. కానీ..కానీ.. ఒక్కసారి, ఒకే ఒక్కసారి ఆయన్ను నాకు చూపించండి. ఆయన ముఖం నేను చూడాలి. ఆయన కనిపించేవరకూ నేనసలు ఏమీ ముట్టను. నన్నిలాగే చావనియ్యండి" హిస్టీరిక్‌గా ఎంతో ఉద్వేగంతో అంది దుర్గ.

అసలేం జరిగిందో అర్ధంకాలేదు నాకు.

"ఏం జరిగిందో మీరైనా చెప్పండి వెంకట్రామయ్యగారూ. ఇంతకీ విశ్వం ఎక్కడికెళ్ళాడు? అసలేం జరిగింది? పరిస్థితి తెలియందే నేను మాత్రం ఏం చేయగలను?" అని నేనన్నాను.

శ్రీరాం గారూ ఇదిగో ఈ లెటరు చదవండి ఏమైందో మీకే తెలుస్తుంది" నా చేతికో కవరు అందించాడు.

అప్రయత్నంగా నా కళ్ళు ఆ అక్షరాల వెంట పరిగెత్తాయి.

**"ప్రియమైన దుర్గకు,**

చిన్నతనం నుంచి అందమైన జీవితంపట్ల ఎన్నో కలలు కన్నాను. చాలామందికి మల్లే దుస్స్వప్నాలు కారాదు అవన్నీ మంచి స్వప్నాలు కావాలి అని కోరుకున్నాను. తెలిసి తెలిసి ఎవరికీ ఏ అపకారం చేసి ఎరగను. స్త్రీపట్ల నేను ఏర్పరచుకున్న గౌరవం అమ్మవల్లనే. జీవితంలో తారసపడిన ప్రతీ స్త్రీని గౌరవంగా చూడాలన్నదే అమ్మ కోరిక. నా జీవితంలో నిన్ను తప్ప మరో స్త్రీని నేనెరుగను.

ఆదాయం తక్కువయినా, వచ్చిన దాంతోనే పొదుపుగా సంసారాన్ని నడుపుతూ నన్ను ధన్యుణ్ణి చేసే భార్యవు అవుతావని కలలు కన్నాను. కానీ అంతా ఒట్టి భ్రమగా మారిపోయింది. ఒక మధ్య తరగతి వాడిగా కాదు, ఒక

లేబరులాగా బతకనారంభించాను. ఎందుకు? ఎందుకని? నా జీవిత భాగస్వామివైన నిన్ను సుఖపెట్టాలని. చిన్నప్పటినుంచి ఖర్చు మనిషైన నిన్ను పేదరికంతో బాధ పెట్టకూడదనే అన్నీ భరించాను. నీతో రాజీపడ్డాను. మన జీవితాలకు ఆధారభూతంగా ఒక బిడ్డయినా పుట్టి, నన్నూ నా బాధల్నీ మరిపింపచేస్తాడని చూసాను. అదీ జరగలేదు..

ఒక సుందరమైన స్వప్నం ముక్కలై పగిలి పోయింది. నా జీవనరేఖ అడ్డంగా వంపులు తిరిగి, పాతాళాన్ని సృష్టించి నన్ను వెక్కిరించింది. అందుకే నా జీవితానికి ఇక్కడితో మంగళం పాడాలని నిశ్చయించుకున్నాను. పదిరోజుల కిందటే నేను రాసిపెట్టిన నా ఉద్యోగపు వాలంటరీ రిటైర్ మెంటు అప్లికేషన్ మేనేజ్‌మెంటు అంగీకరించింది. నా ఇరవై సంవత్సరాల సర్వీసుకు తగిన సొమ్ము చెక్కు ద్వారా ఇస్తారు. ఆ చెక్కును నా జీవితభాగస్వామివైన నీకు ఇవ్వవలసిందిగా నేను నిన్ననే యాజమాన్యంవారికి తెలియచేసాను. ఎడారిలో ఒయాసిస్సులాంటి బతుకులో ఒకటికాదు, ఎన్నెన్నో ఎండమావుల్ని చూసాను. నిరర్ధకమైన, నిస్సారమైన ఈ బతుకు ముంగిట్లోంచి వెనుదిరిగి ఎక్కడికో వెళ్ళిపోతున్నాను.

ఈ ఉత్తరం నువ్వు చూసే సమయానికి మీకెవ్వరికీ అందనంత దూరంలో ప్రయాణిస్తూంటాను.

డియర్ దుర్గా! జీవితం అంటే కేవలం ఆడంబరాలు, డబ్బేకాదని, అదొక అలౌకికమైన మధుర మనోహర భావనను రేకెత్తించే సురుచిర సుందర చిత్రమని నువ్వు గ్రహిస్తే చాలు.

**ఇట్లు,**

**నీకెన్నడూ దగ్గర కాలేకపోయిన**

**విశ్వం."**

ఉత్తరం చదవడం పూర్తిచేసి, దుర్గవంక చూసాను బాధగా.

గట్లు తెగి ప్రవహిస్తున్న సెలయేరులాగా ఉందామె. ఆమె నరనరనా పశ్చాత్తాపంతో రగుల్తోందన్న భావనకు సాక్షిగా, నా పాదాలు వదిలి, భర్త ఫోటోను తీసుకుని గుండెలమీద పెట్టుకుని ఆ గుండెలు ముక్కలయ్యేలా విలపిస్తున్న ఆమె తీరే చెపుతోంది.

వెంకట్రామయ్య భార్య మెల్లగా దగ్గరకు వచ్చింది.

"బాబూ మరో ముఖ్యమైన సంగతొకటి ఉంది."

"ఏమిటి?" అన్నాను.

"బాబూ ఇన్నాళ్ళూ దుర్గ కడుపు పండలేదు. నిస్సారమైన జీవితంలో ఒకర్నొకళ్ళు అర్ధం చేసుకోలేక ఓ పక్క, ఆసరా అంటూ లేక మరోపక్క అలమటించిపోయారు. కానీ..కానీ, ఇప్పుడు దుర్గ గర్భవతి. ఈ పరిస్థితిలో విశ్వం ఇలా..."

దుఃఖంతో పాపం ఆవిడ గొంతు పూడుకుపోయింది.

"ఒరే విశ్వం నువ్వు కోరుకున్న నీ భార్య నీకు దక్కిందిరా ఇప్పుడు. మీ జీవితాలు ధన్యమయ్యే రోజులు వచ్చాయి. నువ్వెక్కడున్నా వెదికి మరీ తీసుకొస్తాను నిన్ను" అంటూ ఉద్వేగంగా గొణుక్కుంటున్న నా దగ్గరకు వెంకట్రామయ్య చేరాడు. అతని రెండు చేతులూ జోడించి ఉన్నాయి. అవి నావేపుగా తిరిగి ఉన్నాయి.

COMMENTS